స్కెచ్ :

# నవ్వు

శ్రీమతి దాసరి శారద

నాకు చిన్న చిన్న విషయాలకే ఊరికే నవ్వు వస్తుంది నవ్వుతో పాటు నాలుగు చివాట్లుగూడ తింటుంటాను. ఎందు కంటారేమో ! నవ్వినందుకు.

కొందరు కారణం లేకుండానే నవ్వుతారు. మఱి కొందరు ఎంత నవ్వువచ్చే విషయమైనా నవ్వనేనవ్వరు. ఈ సందర్భములో షేక్సుపియరు మహాశయుడు ఈ విధముగా అంటాడు. "కొంతమంది మనుష్యులు దేన్ని చూసినా చిలకల్లా నవ్వుతారు. కొందరు ఎంత నవ్వు వచ్చే విషయాన్ని విన్నప్పటికి నవ్వనే నవ్వరు." ఈ రెండవ తెగకు చెందిన వాళ్ళను ఏమనాలో నాకు తెలియదు.

రవీంద్ర నాథఠాకూరు తన చిన్నతనంలో క్లాసులో కూర్చుని పాఠము వింటున్నాడట. ఉన్నట్లుండి ఆయన పక్కన నవ్వాడట. అందుకు మాష్టరుగారు ఠాకూరుని లేపి "క్యోంహస్తేహో?" — (ఎందుకు నవ్వుతున్నావు?) అని ప్రశ్నించారట. ఠాకూరు తడుము కోకుండా వెంటనే "హసీఆయీ !" (నవ్వు వచ్చింది) అన్నాడట. ఇంక మాష్టరుగారికి ఏమి చేయాలో తోచక కూర్చోమని చెప్పారట.

ఈ సందర్భంలో మీకొక విషయము చెప్పాలి. ఒకసారి నా మిత్రురాలు బడినుండి యింటికి వస్తూ ఇద్దరబ్బాయిలని చూచి నవ్విందట. వారిద్దరిలో వాదన బయలు దేరింది. ఏమంటే ఒకడంటాడు "ఆ అమ్మాయి మా పిన్నికూతురు. అందుకే నన్ను చూచి నవ్వింది" అని రెండవ వాడేమన్నా తక్కువ తిన్నాడా? "ఆ అమ్మాయి నా ఫ్రెండు గూడ. అసలు నన్ను చూచే నవ్వింది." అన్నాడు. ఇంకేం మొదటి వాడికి అరికాలి మంట నడినెత్తి కెక్కింది. వెంటనే ఆ అమ్మాయి దగ్గఱికి పరుగెత్తి కెళ్ళి "ఏమండీ ఆ అబ్బాయి మీ స్నేహితుడా? మీరతని చూచేనా నవ్వింది?" అని అడిగాడట. వెంటనే ఆ అమ్మాయి "నేను వాడిని చూచిగాని, నిన్ను చూచిగాని నవ్వలేదు. మీ రిద్దరూ గుడ్లు మిటకరించి గుడ్లగూబల్లా నావైపు చూస్తుంటే నవ్వువచ్చినవ్వాను. చాల్లే ! పోవయ్యో పెద్దమనిషి !" అన్నదట. వాళ్ళు చెరొకదారి పట్టారట.

సామాన్యంగా మనకు తెలిసిన వాళ్ళుగాని, బంధువులుగాని కనబడితే చిఱునవ్వు నవ్వుతాము. అంటే మనకు గల మిత్రత్వం, బాంధవ్యం చిఱునవ్వు ద్వారా తెలియజేస్తామన్న మాట. కొంతమంది మనుష్యు లుంటారు - వాళ్ళు మనకు తెలియక పోయినా వాళ్ళతో మనకెట్టి పరిచయమూ లేకపోయినా సరే మహా తెలిసినట్లు నవ్వుతారు. వీళ్ళని పిచ్చి వాళ్ళనాలో లేకపోతేయింకా ఏమనాలో నాకు తెలియదు. ఇలానవ్వే పిచ్చి వాళ్ళని తలచుకొని నేను ఒకటే నవ్వు కుంటుంటాను.

ఇంకా కొందఱు నవ్వవలసిన సమయములో గూడ నవ్వనే నవ్వరు. నవ్వితే నోట్లో ముత్యాలన్నీ రాలిపోతాయేమోనని భయమనుకుంటాను. ఆ విధముగా ఉంటే వీరికి గొప్ప అనుకుంటారు. నవ్వితే గౌరవాని కేమైనా భంగమేమో ! అంటే నా ఉద్దేశం పిచ్చినవ్వు నవ్వమని కాదు. నవ్వదగ్గ విషయానికిగూడ నవ్వకుండా ఉండటం వారి దౌర్బల్యాన్ని సూచిస్తుందేగాని వేరు కాదు.

జపాను దేశస్తులు ఏదైనా నవ్వువచ్చే విషయం విన్నప్పుడు వెంటనే నవ్వరట. ఇంటికిపోయి ఆలోచించుకొని అప్పుడు కడుపుబ్బ నవ్వుతారట. దీన్నే "జపాన్ విట్" అంటారు.

కొందఱు మందహాసం చేస్తారు. కొందఱు నవ్వుతుంటే ఇంటికప్పు లేచిపోతుందేమో ననిపిస్తుంది. గీనిని

అట్టహాసమంటే బాగుంటుందేమో ! వారు నవ్వేటప్పుడు ప్రక్కనున్న వారి వీపుగూడ పగిలి పోతుందనటములో అతిశయోక్తిలేదు. ఒకసారి నేనూ మా పిన్ని కూతురూ కలసి "సినిమా"కు వెళ్ళాం. ఆట జరుగుతూంది. మధ్య లో హాస్య సన్నివేశాలు కన్పించి నప్పుడల్లా మా పిన్ని కూతురు ఒకటే నవ్వటం, పోనీ నవ్వి ఊరుకున్నా బాగా నేవుండు. ప్రక్కనున్న నావీపు మీద ఒకటే కొట్టటం మొదలు పెట్టింది. అంటే ఆమె నవ్వుతో తన్ను తాను మరచి పోయిందన్నమాట. అంత ఉద్రేకంలో ఆమె మైమరచి నన్నుగూడ నవ్వమని గాబోలు ఒకటేబాదింది. ఆమె నవ్వేట్లా వున్నా నా వీపు వాచిపోయి నాకు ఏడుపు వచ్చిందంటే నమ్మండి.

కొంతమంది, విషయము అర్థమయినాకాక పోయినా "రేగి చెట్టుక్రింద ముసలమ్మ"లాగ నవ్వుతారు.

ఏమన్నా కానీయండి. అసమయాల్లో నవ్వటము మాత్రం మంచిది కాదు. అందువల్ల అనేక నష్టాలు కలుగక మానవు. అలానవ్వబట్టే లక్ష్మణుడనేక మాటలు పడ వలసి వచ్చింది.

పద్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో సీతారాముల్ని కంటిరెప్పలా కాపాడాడు లక్ష్మణుడు. పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినతరువాత తిరిగి అయోధ్యకువచ్చారు. శ్రీరామ చంద్రుడికి పట్టాభిషేకము జరుగుతూంది. ఆ సమయంలో లక్ష్మణుడి కంటిమీదకి కూర్పు వచ్చిందట. ఇన్నాళ్ళులేని నిద్ర యిప్పుడు వచ్చి పడిందేమిటనుకొని లక్ష్మణుడు నవ్వుకున్నాడట. అంటే లక్ష్మణుడు పద్నాలుగు సంవత్సరములు నిద్రను త్యజించాడన్నమాట. కాని అయోధ్యకు తిరిగివచ్చి రాముని పట్టాభిషేకము జరుగుతున్న సమయములో అయనకు నిద్ర వచ్చిందట. అందుకు లక్ష్మణుడికి నవ్వువచ్చి నవ్వాడట. అదిచూచి నలుగురూ నాలుగు విధములుగ అనుకున్నారట. చివరకి శ్రీరాముడు గూడ తాను సీతను మళ్ళీ పరిగ్రహించినందుకు లక్ష్మణుడు నవ్వి వుంటాడను కొన్నాడట. ఈ విధంగా అందరూ అనేక విధాలుగా అనుకొన్నారట. అందుకే "నవ్వు నాలుగు విధాలచేటు" అన్నారు పెద్దలు.

ఒకసారి బ్రహ్మదేవుని సభలో దూర్వాస మహాముని మందపాలుడను మునితో పోటీబడి సామగానము చేస్తుండగా స్వరము తప్పినదట. అక్కడే బ్రహ్మదేవునికి వింజామరతో విసురుచున్న సరస్వతీదేవి పక్కున నవ్విందట. వెంటనే దూర్వాసునికి అరికాలిమంట నడినెత్తికెక్కింది. వెంటనే ఆయన సరస్వతిని శపించాడట. దాని ఫలితంగా ఆమె మర్త్యలోకానికి పోవలసి వచ్చింది. చూడండి ! దూర్వాసునికి స్వరము తప్పితే సరస్వతీ దేవి నవ్వింది. ఆమె చదువుల తల్లి గనుక తప్పిపోతే నవ్వు వచ్చి నవ్వింది. అది సహజము కాని "సులభ కోప మహర్షి" అయిన దూర్వాసుడు కోపముతో కన్ను కానక వాణినే శపించాడు.

ఈ విధంగా నవ్వు వలన అనేక నష్టాలు గూడా వున్నాయ్. ఈ వ్యాసంలో కొన్ని మాత్రమే చెప్పాను. వీలుంటే ఈసారి యింకా కొన్ని చెప్పుకొందాము. ఇప్పటికి సెలవు.


అవతలి గట్టు

(సాంఘిక నవల)

రచన :

కె. రామలక్ష్మి

ఆరుద్ర ప్రచురణలు

1, శివప్రకాశ మొదలి వీధి, మద్రాసు 17.